అందుబాటులోకి అధునాతన వైద్యం

- రూ.48.85 కోట్లతో జిప్‌మెర్ ఆసుపత్రి నిర్మాణం
- నేడు జాతికి అంకితం చేయనున్న ప్రధాని నరేంద్ర మోదీ




ప్రారంభానికి సిద్ధమైన జిప్‌మెర్ ఆసుపత్రి, జిప్‌మెర్‌లో ఐసీయూ గది

యానాం: జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మెర్) ఆసుపత్రి నిర్మాణం పూర్తవ్వడంతో యానాంతో పాటు తూర్పుగోదావరి జిల్లావాసులకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. దీర్ఘకాలిక వ్యాధులు, ప్రాణాంతక వ్యాధుల వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చుచేయడంతో పాటు వందలాది కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి తప్పిందని యానాం వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రూ.48.85 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో జిప్‌మెర్ ఆసుపత్రిలో గుండె, కేన్సర్, ఊపిరితిత్తులు, కాలేయం తదితర దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందించనున్నారు. నేడు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో గుజరాత్‌లోని రాజ్‌కోట్ ఎయిమ్స్ నుంచి జిప్‌మెర్ ఆసుపత్రిని ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.

అత్యాధునిక వైద్య పరికరాల ఏర్పాటు

యానాం జిప్‌మెర్ ఆసుపత్రి నిర్మాణం 2020 జూన్ నెలలో ప్రారంభించి శరవేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అదనంగా రూ.4.85 కోట్లతో ఇప్పటికే మెడికల్ ఎక్విప్‌మెంట్ అమర్చే పనులు పూర్తిచేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్, కారు, అంబులెన్స్ పార్కింగ్, మెడికల్ గ్యాస్ ఎక్విప్‌మెంట్ ఉంచారు. మొదటి ఫ్లోర్‌లో 5-ఓపీడీ గదులు, ల్యాబొరేటరీలు, ఎక్స్‌రే, అల్ట్రా స్కానింగ్, ఈసీజీ, సిటీ స్కాన్, కాన్ఫరెన్స్ హాలు ఉన్నాయి. రెండో ఫ్లోర్‌లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా మెడికల్ వార్డులు, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. మూడో ఫ్లోర్‌లో మూడు ఆపరేషన్ థియేటర్లు, ఐదు ఐసీయూ సర్జరీ గదులు, సీఎస్ఎస్‌డీ సర్జికల్ సామగ్రి, క్లీనింగ్ సెక్షన్ ఉన్నాయి. 4వ ఫ్లోర్‌లో బ్లడ్ బ్యాంక్, లాండ్రి సర్వీస్, ఆఫీసు గదులు ఏర్పాటుచేస్తున్నారు. అంతేకాకుండా రోగుల కోసం మూడు లిఫ్టులు, నాలుగు మెట్ల మార్గాలు, స్టోమ్ వాటర్ డ్రెయిన్స్, యూజీ సంప్, ఇంటర్నల్ రోడ్లు, లాన్ నెట్‌వర్కింగ్ సిస్టమ్, ఆటోమేటిక్ ఫైర్ అలారమ్ సిస్టమ్ తదితర సౌకర్యాలు కల్పించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులైన వైద్యులే ఇక్కడ సేవలందించనున్నారు. ప్రస్తుతానికి జిప్‌మెర్ ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభమయ్యాయని త్వరలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుతాయని జిప్‌మెర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆనంద్‌రాజ్ తెలిపారు.

వైద్య సేవలు మెరుగవుతాయి



యానాం జిప్‌మెర్ ఆసుపత్రి ఏర్పాటుకు కేంద్రప్రభుత్వానికి అనేక సార్లు వినతిపత్రాలు సమర్పించాను. ఆసుపత్రి అవసరాన్ని వివరించడంతో నిధులు మంజూరు చేసి త్వరితగతిన నిర్మానాన్ని పూర్తి చేశారు. జిప్‌మెర్ ప్రారంభంతో యానాంతో పాటు తూర్పుగోదావరి జిల్లాలోని లక్షలాది జనాభాకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

– మల్లాడి కృష్ణారావు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖలో ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన జిప్‌మెర్ సంస్థ వైద్య సేవలు ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. ప్రజలు అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి. జిప్‌మెర్‌కు తోడు మెడికల్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళతాను.

– గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం

వీరభద్రస్వామి తీర్థ మహోత్సవాలు

ముమ్మిడివరం: మండలంలోని సీహెచ్ గున్నేపల్లి బ్రహ్మ గుండాలు వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారి సంబరాలు, బోనాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి మంగళ స్నానం చేయించారు. అనంతరం జరిగిన తీర్థ మహోత్సవాల్లో మండలం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముమ్మిడివరం గణేశుల వారి వీరభద్రుని బోనాలు శనివారం భక్తిశ్రద్ధలతో జరిపారు. గణేశుల కుటుంబ సభ్యులు కులదైవంగా భావించే వీరభద్రుని ప్రతిరూపాన్ని తలపై పెట్టుకుని బాజాభజంత్రీలు, సన్నాయి మేళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద పంట కాలువలో స్వామివారికి స్నానం చేయించారు. అనంతరం జమ్మిచెట్టు వద్ద స్వామివారి బోణాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాతలు తాడి నరేష్ వెండి కలశం, దీపారాధన కుందులు, మేడిద భాస్కరరావు కుటుంబీకులు వెండి త్రిశూలం స్వామివారికి మొక్కుబడిగా చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గోదశి నాగేశ్వరరావు, ధూళిపూడి చక్రం, వేగిరౌతు రాజబాబు, పెన్మత్స చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.14.82 లక్షల నిధుల మంజూరు



ఎంపీ అనురాధ

అల్లవరం: మండలంలోని గోడిపాలెం ఎంపీపీ పాఠశాల నిర్మాణానికి ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.14.82 లక్షలు మంజూరయ్యాయని ఎంపీ చింతా అనురాధ శనివారం తెలిపారు. పాఠశాల శిథిలావస్థకు చేరి విద్యార్థులకు అసౌకర్యంగా ఉండడంతో ఓఎన్‌జీసీ వారికి తాను లేఖ రాశానన్నారు. దానికి స్పందించిన ఓఎన్‌జీసీ అధికారులు నిధులు మంజూరు చేశారని ఎంపీ తెలిపారు. నూతన పాఠశాల భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకోస్తామన్నారు. పాఠశాల భవన నిర్మాణానికి నిధులు కేటాయించిన ఓఎన్‌జీసీకి ఎంపీ అనురాధ, గోడిపాలెం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం

తాళ్లరేవు: మాఘ పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి రంగాచార్యులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విళ్ల సత్యనారాయణ, విళ్ల వీర, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, తాగునీటి సరఫరా తనిఖీ



మున్సిపల్ ఇంజనీర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

అమలాపురం టౌన్: పట్టణంలో ఉదయాన్నే జరుగుతున్న పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా తీరును మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ పలు వీధుల్లో స్కూటీపై తిరుగుతూ తనిఖీ చేశారు. శనివారం వేకువజామున 5.30 గంటల నుంచి ఉదయం 8.30 గంటల వరకూ కమిషనర్ పట్టణంలో పర్యటించారు. క్షేత్ర స్థాయిలోనే తిరుగుతూ సమస్యలను గుర్తించి పారిశుధ్యం, తాగునీటి సరఫరా మెరుగు కోసం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పలు ప్రాంతాలకు నీరు వెళ్లని పరిస్థితులను అధిగమించే చర్యల కోసం ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. మున్సిపల్ డీఈఈ నాగ సతీష్, ఏఈలు, పారిశుధ్య అధికారి, సిబ్బంది కమిషనర్ పర్యటనలో పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారి ఆలయ తొలి వార్షికోత్సవం



అమ్మవారి అభిషేకానికి బిందెలతో సప్త నదీజలాలను తీసుకొస్తున్న భక్తులు

తాళ్లరేవు: మండలంలోని జార్జిపేట గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి ఆలయ తొలి వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకమ పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీదుర్గా మల్లేశ్వర ఆలయం నుంచి వందలాది మంది మహిళలు బిందెలతో సప్త నదీజలాలను మహాలక్ష్మి ఆలయం వరకూ ఊరేగింపుగా తీసుకువచ్చి నదీజలాలతో అభిషేకం జరిపారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయంలో జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

28న వాహనాల బహిరంగ వేలం

తాళ్లరేవు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నటు ఎస్‌హెచ్‌ఓ ఎంఆర్‌కే దాస్ తెలిపారు. తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ప్రాంగణంలో కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో వేలం పాట జరుగుతుందన్నారు. వేలం పాటలో వాహనాలను దక్కించుకున్నవారు 18 శాతం జీఎస్టీతో పాటు పాడుకున్న మొత్తం నగదును చెల్లించాలని తెలిపారు.

అగ్నికుల క్షత్రియుల రాస్తారోకో

తాళ్లరేవు: అగ్నికుల క్షత్రియులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సంఘీయులకు క్షమాపణ చెప్పాలని కోరుతూ శనివారం తాళ్లరేవు మండల అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అనేక మంది మత్స్యకారులు ర్యాలీగా కోరంగి పంచాయతీ సీతారామపురంలోని గుడ్డివానితూము సెంటర్‌కు చేరుకున్నారు. రాస్తారోకో నిర్వహించి చంద్రశేఖర్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బొడ్డు సత్యనారాయణ, వైదాడి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలోనే పల్లెకు వెలుగొచ్చింది

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్



భీమనపల్లిలో ఆసుపత్రి అదనపు గదులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్‌లు నిర్మించడంతో పల్లెలకు వెలుగొచ్చిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం మండలంలోని భీమనపల్లి పంచాయితీ పరిధిలో సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి విశ్వరూప్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సచివాలయం-2 పరిధిలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మంచెంవారి పాలెంలో జలజీవన్ మిషన్ పథకంలో రూ.30.60 లక్షలతో నిర్మిస్తున్న ఓహెచ్ ఆర్ ట్యాంకు నిర్మాణానికి, భీమనపల్లి సచివాలయం-1 పరిధిలో ఉన్న పీహెచ్‌సీలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో వలంటీర్లకు వందనంలో భాగంగా అవార్డులకు ఎంపికైన వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడటంతో ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ చేసిన మంచిని ప్రజలకు వివరించాలని వలంటీర్లకు సూచించారు. పార్టీలకు అతీతంగా వలంటీర్లను నియమించామని ప్రతిఒక్కరూ శ్రద్ధగా పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందని వివరించారు. త్వరలో వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను సీఎం జగన్ విడుదల చేస్తారని, దాన్ని ప్రజలకు వివరించే బాధ్యత ప్రతి వలంటీర్ తీసుకోవాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రాబోయే కాలంలో మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రి చేసుకుని గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకీ, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, వ్యవసాయ మండలి మండల చైర్మన్ మానే శ్రీను, ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వర ప్రసాద్, వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు కె.సురేష్, వి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ విద్యానిధికి విరాళం



దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్య స్వామికి విరాళాలు అందజేస్తున్న జగ్గన్నపేట వాసులు

అమలాపురం రూరల్: కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘ శాశ్వత విద్యానిధికి జగ్గన్నపేట వాసులు విరాళాలు అందించారు. మామిడికుదురు మండలం జగ్గన్నపేటకు చెందిన దేవాంగ పెద్దలు జాన పాలాక్షుడు, అంకం నాగ మల్లేశ్వరరావు, కారుపర్తి శివ శ్రీనివాసరావు, కడి శ్రీనివాసరావు, బళ్ల సత్యనారాయణ, చింతా సత్యనారాయణ (చిన్న), కారుపర్తి కోటేశ్వరరావు, యక్కల మదన్మోహనరావు, కొండా జగదీష్, జీవీ కూర్మా, రామగణపతిలు రూ.1.86 లక్షలను సంఘ అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్య స్వామికి అందజేశారు. పేద దేవాంగ విద్యార్థుల విద్యావ్యాప్తికి ఇప్పటికే రూ.యాభై లక్షలకు పైనే మూల నిధిని సేకరించామని ఆయన అన్నారు. వచ్చే వడ్డీని ప్రతి ఏడాది విద్యార్థులకు ఉపకార వేతనాల రూపంలో అందజేస్తున్నామన్నారు. విరాళాలు అందించిన జగ్గన్నపేట గ్రామస్తులకు సంఘ ప్రధాన కార్యదర్శి పుత్సల వరదరాజు, కోశాధికారి దైవపు నందయ్య, పిచ్చిక శ్యామ్, బళ్ల వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం మాజీ సర్పంచ్ పెట్టా వెంకట్రావు ఎనిమిదో వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు మండల ఎంపీటీసీ సమాఖ్య అధ్యక్షుడు పెట్టా అప్పారావు శనివారం స్థానిక ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామగ్రి అందించారు. పంచాయతీ కార్యాలయం వద్ద వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగి రాజేశ్వరి, జోగి రాజా, పెట్టా మురళి, లంకే శ్రీను, అయితాబత్తుల సూరిబాబు, లంకే చిరంజీవి, సహదేవుడు, బడుగు అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జూనియర్ సివిల్ జడ్జి హిమ బిందు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి హిమ బిందు

అమలాపురం టౌన్: ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అమలాపురం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ మెజిస్ట్రేట్ ఎ.హిమబిందు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు హిమబిందు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చట్టాల గురించి తెలుసుకోవడం ద్వారా ఎన్నో విజయాలు చేకూరుతాయని చెప్పారు. తద్వారా సమాజంలో అభివృద్ధి సాకారమవుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ మాట్లాడుతూ జనన మరణాలు సంభవించినప్పుడు విధిగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నమోదు చేయించుకుని ధ్రువీకరణ పత్రాన్ని పొందాలని సూచించారు. సదస్సులో మండల లీగల్ అథారిటీ మెంబర్, సీనియర్ న్యాయవాది వెంపరాల భాస్కరశాస్త్రి, న్యాయవాదులు కముజు శ్రీనివాసరావు, ఎల్.భార్గవి, వర్రే సత్యనారాయణ హాజరై చట్టాలపై అవగాహన కల్పించారు.

కుండలేశ్వరస్వామికి త్రిశూల స్నానం



కుండలేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: కుండలేశ్వరంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత కుండలేశ్వరస్వామికి కల్యాణం అనంతరం ఆలయ అర్చకులు కాళ్ళకూరి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలతో వృద్ధ గౌతమీ నదిలో పుష్కర ఘాట్ వద్ద స్వామికి శనివారం త్రిశూల స్నానం, చక్ర స్నానం చేయించారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పార్వతీ సమేత కుండలేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కల శ్రీధర్ దంపతుల ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు నేల కిషోర్, హితకారిణి సమాజం చైర్మన్ కాశి మునికుమారి, నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, కాశి హనుమంతరావు, గంటి వెంట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లిలో శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మద్దింశెట్టి రాంబాబు తన తాటాకింట్లోనే కాఫీ హోటల్ నిర్వహిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో రాంబాబు తన భార్యాపిల్లలతో కలిసి కట్టుబట్టలతో ఇంట్లోంచి బయటకు పరుగులు తీశారు. ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. అనారోగ్యంతో శస్త్రచికిత్స కోసం తెచ్చుకున్న సొమ్మంతా కాలిపోయిందని రాంబాబు కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. కాఫీ హోటల్‌పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తాము సర్వం కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రాంబాబు వేడుకుంటున్నారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పరామర్శించి ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధితులకు సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడిపూడి బాబు వంట పాత్రలు, నగదు, బియ్యం, దుస్తులు అందచేశారు. బాధితులను పరామర్శించినవారిలో వైస్ ఎంపీపీలు అడపా సుబ్రహ్మణ్యం, పాలమూరి బాలకృష్ణ, రూరల్ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, దంగేటి రుద్ర ప్రసాద్, ఉంటాల ఉదయ్‌కుమార్, కడిమి బ్రహ్మాజీ తదితరులున్నారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ శెట్టిబత్తుల రాజబాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

సంక్షేమ పథకాల వారధులు వలంటీర్లు

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



ఐ.పోలవరం మండల వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఐ.పోలవరం: సంక్షేమ పథకాల వారధులుగా వలంటీర్లు అందిస్తున్న సేవలకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని టీటీడీ బోర్డు సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. కేశనకుర్రుపాలెం క్షత్రియసేవా సమితి కల్యాణ మండపంలో శనివారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలు రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరన్నారు. వలంటీర్లు గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, 90 శాతం పథకాలు వారి ద్వారానే లబ్ధిదారులకు చేరుతున్నాయన్నారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రచారాలు, ఆర్భాటాలు తప్ప ప్రజాపాలనను గాలికి వదిలేశారన్నారు. నియోజకవర్గంలో 45 వేల మంది పింఛనుదారులకు ఒకటో తేదీ ఉదయం 6 గంటలకు తలుపు తట్టి నగదు ఇస్తున్న ఘనత వలంటీర్లకు, సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వలంటీర్లపై సీఎం జగన్‌కు అపారమైన నమ్మకం ఉందన్నారు. వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయన్నారు.

అందుకే వలంటీర్లపై అనాలోచిత వాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ప్రతిపక్షాల కుట్రలను వలంటీర్లు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మండలంలో ఇద్దరు వలంటీర్లకు సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 338 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, కాశే రాజుబాబు, కాటం సత్తిరాజు, మెండా వెంకన్నబాబు, మోర్త చిన్నా, పెన్మత్స వాసురాజు, పెమ్మాడి బాబూరావు, ఏలూరి ఆదినారాయణ, సుంకర నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని గుత్తినదీవిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో జగనన్న కాలనీలో, కరవాకలంకలో నూతనంగా నిర్మించనున్న రక్షిత మంచినీటి ట్యాంక్ పనులకు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్ రాజు, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, మెండా వెంకన్నబాబు, మోర్త చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి తిథిని పురస్కరించుకుని చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులచే గణపతి పూజ, చండీ పారాయణ, చండీ హోమం జరిపారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సత్తెమ్మ తల్లి జాతర ప్రారంభం

ముమ్మిడివరం: మండలంలోని సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవాల కోసం చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారి జాతర నిర్వహిస్తారు. వచ్చే నెల 3న అమ్మ వారి తీర్థం జరుగుతుంది. ఉత్సవాల సందర్భంగా సుమారు 2,000 మంది కళాకారులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలయ ప్రాంగణంలో భారీ సెట్టింగులతో విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు.

రైల్వే లైన్ భూసేకరణ వేగవంతం



కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ అలైన్‌మెంట్ సర్వే ప్రగతిని పరిశీలిస్తున్న కోనసీమ రైల్వే సాధన సమితి బృందం

అమలాపురం టౌన్: కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్‌కు సంబంధించి అమలాపురం- గుడిమెళ్లంక మధ్య భూసేకరణ పనులు వేగవంతం చేశారు. భూసేకణకు రైల్వే అధికారులతో కలసి రెవెన్యూ అధికారులు సర్వే పూర్తి చేస్తూ అలైన్‌మెంట్ నిర్ధారిస్తున్నారు. పనుల వేగవంతం కావడంపై కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్ఎస్ఎస్) హర్షం వ్యక్తం చేసింది. కేఆర్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యంతో కూడిన బృందం అలైన్‌మెంట్ జరుగుతున్న అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలెం, పేరూరు, అల్లవరం మండలం బోడసకుర్రు వంతెన సమీపంలోని ప్రాంతాల్లో శనివారం పర్యటించింది. అలైన్‌మెంట్‌లో భాగంగా సర్వే పనులు, చేసిన మార్కింగ్‌లను పరిశీలించింది. భూసేకరణ పూర్తయితే రైల్వే ట్రాక్ పనులు మొదలయ్యేందుకు వెసులబాటు కలుగుతుంది. కోనసీమ రైల్వే ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం వాటాగా ఇటీవల రూ.50 కోట్లు విడుదల చేసినందుకు కేఆర్ఎస్ఎస్ హర్షం వ్యక్తం చేసింది. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో కోనసీమ రైల్వే లైన్‌కు రూ.300 కోట్లు కేటాయించడం పనులు వేగవంతం అయ్యేందుకు శుభ పరిణామమని కేఆర్ఎస్ఎస్ బృందం పేర్కొంది. కేఆర్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, సప్పా నాగేశ్వరరావు, ఉప్పుగంటి భాస్కరరావు, ఎరగర్త వెంకటేశ్వరరావు, దొమ్మేటి సత్యనారాయణ తదితరులు రైల్వే పనులను పరిశీలించినవారిలో ఉన్నారు. రైల్వే లైన్ భూసేకరణ పనులు వేగవంతం కావడంపై ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు హర్షం వ్యక్తం చేశారు.

మత్స్యకార పరిహారంపై ఉత్తర్వుల జారీ

యానాం: ఓఎన్‌జీసీ సంస్థ చేపట్టిన పైపులైను పనుల కారణంగా జీవనోపాధి కోల్పోతున్న యానాం మత్స్యకారులకు సదరు సంస్థ మంజూరు చేసిన నష్టపరిహారం సొమ్ము పంపిణీకి సంబంధించిన ఉత్తర్వులను పుదుచ్చేరి ముఖ్యమంత్రి కార్యాలయం శనివారం జారీ చేసింది. 5,462 మంది లబ్ధిదారులకు పరిహారం సొమ్ము అందనుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఓఎన్‌జీసీ సంస్థ రూ.93 కోట్ల పరిహారం సొమ్ము విడుదల చేయడానికి ముందుకు వచ్చిందని, ఆ సొమ్ము రాగానే మొదటి విడతగా 5,289 మంది లబ్ధిదారులకు పరిహారం అందజేస్తామని తెలిపారు.